
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు
5
సోమవారం 10 నవంబరు 2025



డోన్ ప్రజల కల నెరవేరేనా?



- నియోజకవర్గాన్ని కర్నూలు జిల్లాలోనే కొనసాగించాలని డిమాండ్
- ఎమ్మెల్యే కోట్ల తీవ్ర ప్రయత్నాలు
- డోన్ నుంచి నంద్యాలకు వెళ్లాలంటే నరకయాతనే
- ప్రజలకు శాపంగా మారిన గత ప్రభుత్వ నిర్ణయం

పరిపాలన సౌలభ్యం కోసం వైసీపీ ప్రభుత్వం జిల్లా పునర్విభజన చేపట్టింది. కొత్త జిల్లాల ఏర్పాటుతో లాభం ఏమో కానీ డోన్ నియోజకవర్గ ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి. ఎన్నో ఏళ్లుగా కర్నూలు జిల్లాతో ఉన్న అనుబంధాన్ని కోల్పోయింది. డోన్ నుంచి నంద్యాల వెళ్లేందుకు నియోజకవర్గ ప్రజలు సైతం ఇష్టపడటం లేదు. సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడం.. గంటల తరబడి ప్రయాణం చేయాల్సి రావడం.. దీంతో తమను ఎలాగైనా కర్నూలు జిల్లాలోనే కొనసాగించాలని వేడుకుంటున్నారు. ఎన్నికల వేళ కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి సైతం హామీ ఇచ్చారు. డోన్, ప్యాపిలి మండలాలను కర్నూలులోనే కొనసాగేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆయన అధిష్ఠానం దృష్టికి సైతం ఈ విషయాన్ని తీసుకెళ్లారు. సీఎం చంద్రబాబు కూడా సానుకూలంగా ఉన్నట్లు సమాచారం.

డోన్ టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): డోన్, ప్యాపిలి మండలాలను కర్నూలు జిల్లాలో విలీనం చేసేందుకు ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి కృషిచేస్తున్నారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీని అమలుచేస్తే కోట్ల కుటుంబంపై నియోజకవర్గ ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగే అవకాశముంది. విలీన ప్రక్రియను నెరవేర్చేందుకు ఎమ్మెల్యే కోట్ల అధిష్ఠానం వద్ద గట్టిగానే కృషిచేస్తున్నట్లు తెలిసింది.

50 కిలోమీటర్ల దూరంలో ఉన్న..

50కిలోమీటర్ల దూరంలో ఉన్న కర్నూలుకు వెళ్లేందుకు హైవే కూడా ఉంది. డోన్ నుంచి కర్నూలుకు ఒక గంట ప్రయాణం. డోన్ నుంచి నంద్యాలకు 80కిలోమీటర్లు ప్రయాణ కష్టాలతో ఇబ్బందులు పడాల్సిందే. డోన్ నుంచి బస్సులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. డోన్ నుంచి నంద్యాలకు వెళ్లాలంటే 3గంటలకు పైగానే ప్రయాణం. నంద్యాలకు వెళ్లాలంటే డోన్, ప్యాపిలి మండలాల ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క రైతుల ఇబ్బందులు, నంద్యాల కలెక్టరేట్‌కు వెళ్లాలన్నా ప్రజలు, ఉద్యోగుల తిప్పలు వర్ణణాతీతం.

అడ్డ గోలుగా విభజన

డోన్ నియోజకవర్గంలో బేతంచెర్ల, ప్యాపిలి, డోన్ మండలాలు ఉన్నాయి. మొత్తంగా నియోజకవర్గంలో 2లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారు. ఇందులో డోన్ పట్టణం, మండలంలోని ఓటర్లు 80వేలకు పైగా ఉన్నారు. గతంలో కర్నూలు జిల్లాలోనే డోన్ నియోజకవర్గం కొనసాగుతూ వచ్చింది. జిల్లాల పునర్విభజనలో భాగంగా 2022లో ఏప్రిల్‌లో డోన్ నియోజకవర్గాన్ని వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా నంద్యాల జిల్లాలో విలీనం చేశారు. కర్నూలు జిల్లాకు ఉన్న అనుబంధాన్ని డోన్ నియోజకవర్గం కోల్పోయింది. ప్రజలకు కొత్త సమస్యలు వచ్చి పడ్డాయి. అడ్డగోలుగా విభజించడంతో వైసీపీ ప్రభుత్వంపై డోన్, ప్యాపిలి మం డలాల ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో మాజీ మంత్రి బుగ్గన ఓటమి చవి చూడడానికి కారణం ఇదేనని పలువురు మేధావులు, సంఘాల నాయకులు చర్చించుకుంటున్నాయి. పరిపాలనా, ప్రజల సౌలభ్యం కోసమైనా నంద్యాల నుంచి కర్నూలులో కలపాలని, డోన్, ప్యాపిలి మండలాల ప్రజలు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

రవాణా ఖర్చులు ఎక్కువయ్యాయి



ఏ చిన్నసమస్య వచ్చినా నంద్యాలకు వెళ్లాల్సి వస్తుంది. దీంతో రవాణా ఖర్చులు పెరిగాయి. చిన్న వ్యాపారాలు చేసుకునే వారం. నంద్యాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. కర్నూలు జిల్లాలోనే డోన్, ప్యాపిలి మండలాలను కొనసాగించాలి.

● వెంకట సుబ్బమ్మ, పూల వ్యాపారి, డోన్

ఏ చిన్నసమస్య వచ్చినా..



ఏ చిన్నసమస్య వచ్చినా, మీటింగుల కోసం నంద్యాలకు వెళ్లాలంటే నరకయాతన అనుభవించాల్సిందే. నంద్యాలకు వెళ్లాలంటే ఒక్కరోజంతా సమయం పడుతుంది. కలెక్టరేట్ స్పందనకు అర్జీలు ఇవ్వడానికి దాదాపు 90 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుంది. రవాణా సౌకర్యాలు కూడా సక్రమంగా లేవు.

● ఎస్.అబ్దుల్ రెహమాన్, ఆవాజ్ కమిటీ కార్యదర్శి, డోన్



సీఎం దృష్టికి తీసుకెళ్లా



ప్రజల సౌలభ్యం కోసం డోన్, ప్యాపిలి మండలాలను కర్నూలు జిల్లాలోనే కొనసాగేందుకు కృషి చేస్తున్నాం. ఈవిషయాన్ని సీఎం చంద్రబాబు, మంత్రులు సత్యనారాయణ ప్రసాద్, నాదెండ్ల మనోహర్, బీసీ జనార్దన్‌రెడ్డి, అనిత, నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లాను. సానుకూలంగా స్పందించారు.

● కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్యే, డోన్

నేడు డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ



కల్లూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని విద్యుత్ సదరన్ డిస్కం కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆశాఖ సీఎండీ శివశంకర్ ఆదివారం తెలిపారు. డిస్కం పరిధిలోని కర్నూలు నంద్యాల, శ్రీ సత్యసాయి, అనంతపురం, అన్నమయ్య, వైఎస్సార్ కడప, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లా వినియోగదారుల నుంచి సమస్యలు తెలుసుకునేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. అందులో భాగంగా వినియోగదారులు 8977716661 నెంబరుకు ఫోన్ చేసి, 9133331912 నెంబరుకు చాట్ చేయడం ద్వారా సమస్యలు తెలపాలన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పైన తెలిపిన మొబైల్ నెంబర్లకు విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేయాలని సూచించారు.

శ్రీశైలానికి తగ్గిన ఇన్‌ఫ్లో

- 883.80 అడుగుల నీటి నిల్వ



శ్రీశైలం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీశైల జలాశయానికి ఎగువ ప్రాజెక్టుల నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పట్టింది. ఆదివారం జూరాల ప్రాజెక్టు విద్యుదుత్పత్తి ద్వారా 23,638 క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 6,759 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. సాయంత్రానికి శ్రీశైల జలాశయానికి ఇన్‌ఫ్లో 26,478 క్యూసెక్కులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అలాగే కుడిగట్టు విద్యుదుత్పత్తి కేంద్రం ద్వారా 9,585 క్యూసెక్కులు, ఎడమ గట్టు విద్యుదుత్పత్తి ద్వారా 35,315 మొత్తంగా 44,900 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలయింది. జలాశయంలో నీటిమట్టం 883.80 అడుగులు ఉండగా, పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 215 టీఎంసీలకు గాను 208.72 టీఎంసీలుగా నమోదైంది.

మహానందిలో భక్తుల సందడి

- రుద్రగుండం కోనేరులో భక్తుల పుణ్యస్నానాలు



మహానందిలో దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

మహానంది, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకొని మహానంది క్షేత్రంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం తెల్లవారుజామున 4గంటల నుంచే ఆలయ ప్రాంగణంలోని రుద్రగుండం కోనేరుతో పాటు రెండో ప్రాకారంలోని పూల కోనేర్లలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. పరమేశ్వరుడి దర్శనం కోసం క్యూలో భక్తులు బారులు తీరారు. మహిళలు ఆలయ పరిసరాల్లోని ధ్వజస్తంభం, నాగుల కట్ట వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాస రెడ్డి భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్తీక మూడో సోమవారం మహానంది ఆలయంలో మరింత భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉందని ఈవో తెలిపారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నంద్యాల నూనెపల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరేట్‌తో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ అర్జీలను ప్రత్యక్షంగా ఇవ్వడమే కాకుండా ఆన్‌లైన్‌లో కూడా సమర్పించవచ్చని ఆమె పేర్కొన్నారు. అర్జీ పరిస్కార స్థితి గురించి తెలుసుకోవడానికి వెబ్‌సైట్‌లోనూ లేదా టోల్ ఫ్రీ నంబరు 1100 ద్వారా తెలుసుకోవచ్చని వివరించారు. అర్జీదారులు మొదట తమ మండల, డివిజన్ లేదా మున్సిపల్ కార్యాలయాల్లోని అధికారులకు అర్జీలు ఇవ్వాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలు మాత్రమే జిల్లా కేంద్రానికి తీసుకురావాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలి : ఏఐఎస్‌ఎఫ్



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి నాసర్జీ

డోన్ రూరల్ నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజు, నాసర్జీ, ఏఐఎస్ఎఫ్ మాజీ ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు, మాజీ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యదర్శి రవి మోహన్‌లు డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కారం కోరుతూ ఇచ్చాపురం నుంచి హిందూపురం వరకు జరుగుతున్న బస్సు యాత్ర ఆదివారం డోన్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా పాతబస్టాండులో ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.6,400ల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు విడుదలలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందన్నారు. నంద్యాల జిల్లాలో అగ్రికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సూర్యప్రతాప్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు మాధవ్, డోన్ సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు రాముడు, నారాయణ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రణత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో ఆరుద్ర పూజలు

- వైభవంగా స్వర్ణ రథోత్సవం, పల్లకీ సేవ
- స్వామి, అమ్మవార్లను అధిక సంఖ్యలో దర్శించుకున్న భక్తులు

శ్రీశైలం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో స్వామి, అమ్మవార్లకు ఆరుద్ర నక్షత్ర పూజలు, స్వర్ణ రథోత్సవం, పల్లకీ సేవను ఆదివారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుఝామున స్వామికి మహన్యాస పూర్వక ఏకదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, బిల్వార్చనలు చేసి భక్తులకు దర్శనాలు తీర్థప్రసాదాలు కల్పించారు. గంగాధర మండపం రథశాల వద్ద స్వర్ణరథంపై ఆసీనులై ఉన్న స్వామి, అమ్మవార్లకు షోడశోపచార పూజా క్రతువులు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు, ఈవో శ్రీనివాసరావు, అధికారులు పూజలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన వీధిలో భక్తులు కార్తీక దీపాలు వెలిగిస్తూ రద్దీ ఎక్కువగా ఉండడంతో గ్రామోత్సవం నిర్వహించలేదని అధికారులు తెలిపారు. కళాకారులు సంప్రదాయ నృత్యాలు చేస్తూ స్వామి, అమ్మ వార్లకు నృత్య నివేదన చేశారు. సాయంత్రం అమ్మవారి ఆలయంలో పుష్పాలంకరణ చేసిన పల్లకిపై ఆదిదంపతులను ఆశీనుల చేసి వార పూజలు చేశారు. పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు.



ఆకాశదీపం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఈవో, అర్చకులు



స్వర్ణ రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఈవో, చైర్మన్



స్వామి, అమ్మవార్లకు నమస్కరిస్తున్న భక్తులు

శివ నామస్మరణతో మార్మోగిన శ్రీగిరి క్షేత్రం

పరమశివుని జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్ర పర్వదినం సందర్భంగా మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్లను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచే క్యూలైన్ల ద్వారా ఉభయ దేవాలయాల్లో అలంకార దర్శనం కల్పించారు. ఉచిత దర్శనానికి కంపార్ట్‌మెంట్లలో వేచి ఉండే భక్తులకు 5నుంచి 6 గంటల సమయం పట్టగా, శ్రీఘ్ర, అతిశీఘ్ర టిక్కెట్ దర్శనాలకు రెండు గంటలు, వీఐపీ బ్రేక్ టికెట్లు పొందిన వారికి గంట సమయం పట్టిందని ఆలయ అధికారులు చెప్పారు. సుమారు 50 వేల మంది దర్శించుకున్నట్లు ఈవో తెలిపారు. సాయత్రం ఆలయ ధ్వజస్తంభంపై ఆకాశదీపాన్ని వెలిగించారు. కళారాధన వేదికపై కళాకారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

రేపు ప్రాజెక్టులకు సీఎం శంకుస్థాపన

- వర్చువల్‌గా ప్రారంభించనున్న చంద్రబాబు
- ఏర్పాట్లు చేయాలని అధికారులకు కర్నూలు కలెక్టర్ ఆదేశం

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు ప్రాజెక్టులకు మంగళవారం ముఖ్యమంత్రి వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని, తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ సిరి అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆర్డీవోలు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ పరిశ్రమల శాఖ అధికారి, ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్, టూరిజం అధికారి తదితరులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం ముఖ్యమంత్రి జిల్లాలో ఏపీఐఐసీ, ఎయిర్‌పోర్టు, పర్యాటకానికి సంబంధించిన ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారని తెలిపారు. ప్రొటోకాల్ ప్రకారం అందరికీ ఆహ్వానం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్, ఆదోని ఆర్డీవో అజయ్ కుమార్ పాల్గొన్నారు.

వన రక్షకులు భద్రమేనా?

- అటవీ శాఖను వేధిస్తున్న ఆయుధాల కొరత
- ఎన్ఎస్‌టీఆర్ పరిధిలో పరిస్థితి మరీ దారుణం
- నేడు రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

7

జీజీహెచ్‌లో ఆగని దొంగతనాలు

- ఫిజియోథెరపీ వార్డులో రాగి తీగలు, ప్రోబ్ పరికరాలను ఎత్తుకెళ్లిన దొంగలు

ఆకాశాన్నంటుతున్న ధరలు

- పెరిగిన పూలు, పండ్ల రేట్లు
- మొంథా తుఫాన్ ప్రభావంతో తగ్గిన దిగుబడి



చిట్టిరోజాలు, చామంతిపూలు

చాగలమర్రి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం వచ్చిందంటే పూలు, పండ్ల ధరలకు రెక్కలొచ్చేస్తాయి. నెల రోజుల పాటు దేవతామూర్తులకు విశేష పూజలు అందించడంతో పాటు ప్రతి ఆలయం భక్తులతో కళకళలాడుతోంది. నిన్నమొన్నటి వరకు సామాన్యులకు కూడా అందుబాటులో ఉండే పూలు, పండ్ల ధరలు కార్తీకమాసం పుణ్యమా అని మరింత పెరిగాయి. అయ్యప్పస్వామి భక్తులు, భవానీ మాలధారణ, శివమాలధారణలు ఈమాసంలోనే అత్యధికంగా ఉండటంతో పూలు, పండ్ల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. ఒకవైపు కార్తీకమాసం, మరో వైపు మొంథా తుపాన్ ఎఫెక్ట్ కారణంగా దిగుబడి తగ్గడంతో వాటి రేట్లు కొండెక్కి కూర్చున్నాయి.

కార్తీకమాసంలో డిమాండ్

కార్తీకమాసం ప్రారంభం కావడంతో అధిక శాతం మంది ఉపవాస దీక్షలు ఉంటారు. పండ్లు, ఫలాలు తిని రాత్రి భోజనం చేయడం మంచిదని పెద్దలు చెబుతుండగా అందుకోసం మహిళలు ఉపవాస దీక్షతో పూజలు చేయడం సంప్రదాయంగా వస్తోంది. అయితే ఈ సీజన్‌లో పండ్ల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. యాపిల్, నారింజ, దానిమ్మ, జామకాయ తదితర పండ్లు ఎక్కువగా కొనుగోలు చేస్తుండగా గత వారం రోజుల క్రితం వరకు కేజీ రూ.100 నుంచి రూ.150 మాత్రమే అమ్మిన పండ్లు తుఫాన్ ప్రభావంతో దిగుబడి తగ్గిందనే కారణం చూపి ధరలు ఒకేసారి కేజీకి రూ.50 నుంచి రూ.100 పెంచేసి అమ్మకాలు చేస్తున్నారు. ఇక అరటిపండ్లు ఇతర రోజుల్లో డజన్ రూ.30 నుంచి రూ.40 ఉండగా ప్రస్తుతం డజన్ రూ.50 నుంచి రూ.70కు పెంచేశారు. దీంతో ఏ పండ్లు కొనాలన్న కనీసం రూ.200 తక్కువ లేకపోవడంతో చేసేదేమి లేక భక్తులు అరకేజిలతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో భక్తులు పూజలు మానుకోలేక, ఇటు పూలు, పండ్లు కొనలేక పెరిగిన ధరలతో బెంబేలెత్తుతున్నారు.

పూల ధరలకు రెక్కలు

పండ్ల ధరలు చూస్తే కొనలేని పరిస్థితి నెలకొనగా, ఇక సున్నితంగా కనిపించే పూలు ముంటుకుంటేనే ధరల ముళ్లు గుచ్చుకుంటున్నాయి. బంతిపూలు, చామంతిపూలు వంటి పూలకు సాధారణ రోజుల్లో పెద్దగా డిమాండ్ లేకపోగా ప్రస్తుతం అన్ని పూలకన్న ఇవి రెండే ధరల విషయంలో విరుచుకపడుతున్నాయి. గతంలో కేజీ బంతిపూలు, చామంతులు రూ.100 లోపు మాత్రమే ఉండగా ప్రస్తుతం వాటి ధర మరింత రెట్టింపయింది. బంతిపూలు, చామంతి పూలు కేజీ రూ.200 వరకు పలుకుతుండగా కనకాంబరం, కాగడాలు, జాజిపూలు వంటి పూలు మూర రూ.50 నుంచి రూ.70 వరకు పలుకుతున్నాయి. కేజీ జాజులు ధర రూ.700, మల్లెలు రూ.600 పలుకుతున్నాయి.

రాఘవేంద్రుడి సన్నిధిలో ప్రముఖులు



ప్రాంగణంలో ఢిల్లీ పశువైద్య సంక్షేమబోర్డు ఆఫ్ ఇండియా నోడల్ అధికారి ఎస్. కృష్ణ మిట్టల్, తెలంగాణ మెంబర్ మహేష్ అగర్వాల్

మంత్రాలయం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనార్థం పలువురు ప్రముఖులు మంత్రాలయానికి చేరుకున్నారు. ఢిల్లీ పశు వైద్య సంక్షేమ బోర్డు ఆఫ్ ఇండియా నోడల్ అధికారి, జల్లికట్టు పరిశీలన అధికారి కృష్ణమిట్టల్, తెలంగాణ పశువైద్య వెల్ఫేర్ బోర్డు మెంబర్ డా.మహేష్ అగర్వాల్ కుటుంబ సమేతంగా ఆదివారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. వీరికి మహాముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, శ్రీపతిఆచార్, ఐపీ నరసింహామూర్తి ఘనస్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదమిచ్చి ఆశీర్వదించారు. అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, పవన్ఆచార్, వ్యాసరాజాచార్, జయతీర్థ ఆచార్, రంగస్వామి పాల్గొన్నారు.

గో సంరక్షణ కేంద్రం అభివృద్ధి చెందాలి

రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోసంరక్షణ కేంద్రం మరింత అభివృద్ధి చెందేందుకు శ్రీమఠం అధికారులు కృషిచేయాలని ఢిల్లీ పశువైద్య సంక్షేమ బోర్డు ఆఫ్ ఇండియా నోడల్ అధికారి కృష్ణ మిట్టల్ అన్నారు. దర్శనం అనంతరం శ్రీమఠం గోశాలను పరిశీలించారు. గోవుల సంఖ్య, పశుగ్రాసం, సౌకర్యాలు, తాగునీరు, వైద్యం అంశాలపై పరిశీలించారు. మంత్రాలయంలో విశాలమైన గోసంరక్షణ కేంద్రం ఏర్పాటుచేయడం అభినందనీయమని మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం నుంచి గోసంరక్షణకు అవసరమైన సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. ఈపరిశీలనలో మంత్రాలయం మండల పశువైద్య అధికారి సంతోష్ కుమార్, వెటర్నరీ లైవ్‌స్టాక్ అధికారి వరప్రసాద్, గోశాల సూపర్‌వైజర్ రాఘవేంద్రరావు దేశాయ్, హనుమంతు, సిబ్బంది పాల్గొన్నారు.

బతుకుదెరువు కోసం వచ్చి మృత్యుఒడికి..

● బైక్‌ను ఢీకొట్టిన వాహనం ● మృతుడు జార్ఖండ్ వాసి



పవన్(ఫైల్)

మహానంది, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం వచ్చిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండలంలోని గాజులపల్లి ఆర్ఎస్ సమీపంలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. జార్ఖండ్‌కు చెందిన పవన్(26) అనే యువకుడు గాజులపల్లి ఆర్ఎస్ సమీపంలో మరకత లింగేశ్వరుడు, నవగ్రహాల ఆలయంలో దినసరి కూలీగా కొన్నేళ్లుగా పనిచేస్తున్నాడు. ఆదివారం కూడా యథావిధిగా ఆలయం నుంచి పశువుల ఫారానికి పాలు తెచ్చేందుకు బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో బుక్కాపురం నుంచి గాజులపల్లి వైపు వెళ్తున్న వాహనం వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పవన్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థి బలవన్మరణం

కర్నూలు క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఫ్యాన్‌కు ఉరేసుకొని ఓ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈఘటన నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో విఠల్‌నగర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. కాలనీకి చెందిన భరత్‌కుమార్(20) అనే విద్యార్థి కేవీ సుబ్బారెడ్డి కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ప్రస్తుతం 5వ సెమిస్టర్ పరీక్షలు జరుగుతుండగా.. సరిగ్గా చదవకపోవడంతో తరుచూ మనస్తాపానికి గురయ్యాడు. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి మాధవి గుర్తించి భర్త శ్రీరాములుకు ఫోన్ చేయగా.. ఆయన వచ్చి భరత్‌ను కిందకు దించి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

వన రక్షకులు భద్రమేనా?

● అటవీ శాఖను వేధిస్తున్న ఆయుధాల కొరత
● ఎన్ఎస్‌టీఆర్ పరిధిలో పరిస్థితి మరీ దారుణం
● నేడు రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

వనాల సంరక్షణలో ప్రతిఒక్కరిని భాగస్వాముల్ని చేయాలన్న సంకల్పంతో స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయి. ప్రత్యేకించి వనాల, వన్య ప్రాణుల సంరక్షణలో అటవీ శాఖ ఉద్యోగుల పాత్ర కీలకం. అడవితల్లి రక్షణకై ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వర్తిస్తున్నారు. విధినిర్వహణలో వారి భద్రత ప్రశ్నార్థకంగా ఉందన్న విమర్శలున్నాయి. నేడు రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అటవీ శాఖ ఉద్యోగుల రక్షణపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.



అమరుల స్మారక స్థూపానికి అటవీ అధికారుల నివాళి

ఆత్మకూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అటవీ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఆయుధాలను ఇవ్వడంలో ప్రభుత్వాలు జాప్యం వహిస్తున్నాయి. ఎర్రచందనం ఏరియాల్లో పనిచేస్తున్న అటవీశాఖ ఉద్యోగులకు మాత్రమే ఆయుధాలను అందించి మిగతా ఏరియాల్లో పనిచేస్తున్న వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. అనేక సందర్భాల్లో అటవీ ఉద్యోగులు స్మగ్లర్ల చేతుల్లో బలికావాల్సిన పరిస్థితులు లేకపోలేదు. 2020 మే20న పెద్దపులుల సంరక్షణలో అత్యంత కీలకంగా ఉన్న ఆత్మకూరు అటవీ డివిజన్‌లో పనిచేస్తున్న 9మంది ఎఫ్ఎస్‌వోలకు, ఎఫ్‌బీ వోలను ఎంపిక చేసి వారికి 12బోర్ కంపాక్షన్ గన్స్, బుల్లెట్లను పంపిణీ చేశారు.



విధినిర్వహణలో అటవీశాఖ సిబ్బంది

ఆయుధాలు ఇవ్వాలన్న అంశాన్ని..



అటవీశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఆయుధాలు ఇవ్వాలన్న అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుంది. ఇదేజరిగితే అటవీ, వన్యప్రాణుల సంరక్షణ మెరుగుపడే అవకాశముంది. సోమవారం జరిగే అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రేంజర్ రామయ్య, వాచర్ లక్ష్మానాయక్‌లను స్మరించుకుంటాం. ● విఘ్నేష్ అప్పావ్, డిప్యూటీ డైరెక్టర్, ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్

రెచ్చిపోతున్న స్మగ్లర్లు

నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం (ఎన్ఎస్‌టీఆర్) పరిధిలో పనిచేస్తున్న అటవీ సిబ్బందికి సరైన ఆయుధాలు లేకపోవడంతో స్మగ్లర్లు రెచ్చిపోతున్నారు. ఉద్యోగులకు ఆయుధాలను అందిస్తే స్మగ్లర్లు అడవిలో అడుగు పెట్టేందుకు కూడా భయపడతారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

శ్రీనివాస్‌ను స్మరిస్తూ..



ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా, గోకవరం మండలం కోటిపల్లికి చెందిన ఐఎఫ్ఎస్ అధికారి పందిళ్లపల్లి శ్రీనివాస్ కర్ణాటక క్యాడర్‌లో విధులు నిర్వహిస్తూ కలప అక్రమ రవాణా, వన్య ప్రాణుల వేట కట్టడికి శ్రీకారం చుట్టారు. తమ స్మగ్లింగ్‌కు శ్రీనివాస్‌గా అడ్డుగా ఉన్నారని భావించి వీరప్పన్ తన అనుచరులతో కలసి 1991, నవంబరు 10వ తేదీన ఆయన్ని హతమార్చారు. అటవీ రక్షణకై విశేష సేవలు అందించిన శ్రీనివాస్‌ను స్మరిస్తూ 1992 నుంచి నవంబర్ 10 న రాష్ట్ర అటవీ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఆయన మరణాంతరం 1992లో కేంద్ర ప్రభుత్వం కీర్తిచక్ర అవార్డుతో గౌరవించారు.

అమరుడైన రేంజర్ రామయ్య



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 21మంది అటవీ ఉద్యోగులు అమరులయ్యారు. ఆత్మకూరు అటవీ డివిజన్‌కు చెందిన బైర్లూటి రేంజ్ అధికారి రామయ్య 1994 జూన్ 20వ తేదీన మావోయిస్టుల చేతిలో హత్యకు గురయ్యారు. రేంజర్ రామయ్య ప్రాణత్యాగానికి జ్ఞాపకార్థంగా బైర్లూటిలో ఏర్పాటుచేసిన స్మారక స్థూపం వద్ద ప్రతిఏటా అటవీ అమరుల దినోత్సవం సందర్భంగా అటవీ ఉద్యోగులు నివాళులర్పిస్తారు. ఈ ఏడాది అక్టోబరు 18న వెలుగోడు రేంజ్ పరిధిలో లక్ష్మానాయక్ అనే ప్రొటెక్షన్ వాచర్ వన్యప్రాణి వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలను తగిన హతమయ్యాడు.



ఆత్మకూరు అటవీ సిబ్బందికి ఆయుధాలను అందజేస్తున్న దృశ్యం (ఫైల్)



పత్తి ఓబులయ్యకు 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' అవార్డు

● 14వ వార్షికోత్సవం సందర్భంగా ప్రకటించిన తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్
● 14న హైదరాబాదులో ప్రదానం



కర్నూలు కల్చరల్), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన ప్రముఖ నాటక దర్శకుడు, సాహితీవేత్త, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్యకు హైదరాబాదులోని తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు' (జీవితకాల పురస్కారం) ప్రకటించింది. కళారంగంలో ఆయన చేస్తున్న సుదీర్ఘ ఏళ్ల సేవలను గుర్తించి, సంస్థ 14వ వార్షికోత్సవ సందర్భంగా ఈ పురస్కారం ఈనెల 14న హైదరాబాదులోని చిక్కడపల్లిలో గల త్యాగరాజ గానసభలో జరిగే వార్షికోత్సవ వేడుకల్లో ప్రముఖుల చేతుల మీదుగా పత్తి ఓబులయ్యకు అందజేయనుంది. ఈ వివరాలు ఆదివారం తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ చైర్మన్ చింతపట్ల వెంకటాచారి ప్రకటించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ఈ ఏడాది వరుసగా మూడుసార్లు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో టీజీవీ కళాక్షేత్రానికి చోటు లభించేలా కృషి చేశారు. పత్తి ఓబులయ్య జిల్లా నాటక రంగ ఖ్యాతిని దశదిశలా చాటారు. గత రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా నిర్వహించిన నంది నాటక పోటీల్లో 38 నందులు సాధించిన ఘనత ఆయనకు దక్కుతుంది. వృత్తిరీత్యా తెలుగు అధ్యాపకునిగా పనిచేస్తున్న కాలంలోనే పత్తి ఓబులయ్య అనేక శతకాలు రాశారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షునిగా కొనసాగుతున్న పత్తి ఓబులయ్య కళాక్షేత్రం వ్యవస్థాపక చైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, ఆయన తనయుడు రాష్ట్ర మంత్రి టీజీ భరత్‌ల సహకారంతో సంగీత కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్నారు.

రేపు జాతీయ విద్యా దినోత్సవం

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మొదటి కేంద్ర విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జన్మదినం సందర్భంగా మంగళవారం మైనార్టీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి పర్వీన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు కలెక్టరేట్‌లో సాయంత్రం 4.30 గంటలకు సునయన ఆడిటోరియంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని కోరారు.

జీజీహెచ్‌లో ఆగని దొంగతనాలు

● ఫిజియోథెరపీ వార్డులో రాగి తీగలు, ప్రోబ్ పరికరాలను ఎత్తుకెళ్లిన దొంగలు



ఫిజియోథెరపీ విభాగం

కర్నూలు హాస్పిటల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో దొంగతనాలు కలకలం రేపుతున్నాయి. మొన్న ప్రసూతి విభాగంలో ముగ్గురు వైద్యుల పర్సులోని డబ్బులు చోరీ ఘటన మరువక ముందే తాజాగా శనివారం రాత్రి ఫిజియోథెరపీ విభాగంలో రూ.10లక్షల విలువైన పరికరం, రాగి వైర్లు ఎత్తుకెళ్లారు. సిబ్బంది శనివారం రాత్రి తాళం వేయకపోవడంతోనే దొంగతనం చోటుచేసకున్నట్లు తెలుస్తోంది. ఇదే గదిలోని ఆర్థోటిక్ చెందిన పాత పరికరాన్ని అపసంహరించేందుకు విఫలయత్నం చేశారు. సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వర్లు ఉదయం ఫిజియోథెరపీ విభాగాన్ని పరిశీలించారు. ఆర్ఎంవోలతో చర్చించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీఎస్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.



దొంగలు అపహరించేందుకు ప్రయత్నించిన పరికరం ఇదే

సూపరింటెండెంట్ ఆగ్రహం

ఫిజియోథెరపీ విభాగంలో దొంగతనంపై సూపరింటెండెంట్ ఈగల్ హంటర్ ఏజెన్సీ ఎస్‌వో రామకృష్ణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సెక్యూరిటీ సిబ్బంది జాబితా ఇవ్వాలని ఎన్నిసార్లు అడిగిన ఎందుకు ఇవ్వడం లేదని మండిపడ్డారు. 238 మంది ఉండాల్సి ఉండగా, 160 మంది మాత్రమే ఉన్నారని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు సెక్యూరిటీ సూపర్‌వైజర్లను సస్పెండ్ చేశారు. సర్జెంట్ ఉరుకుందయ్యను విధుల నుంచి తప్పించి మరొకరికి బాధ్యతలు అప్పగిస్తున్నట్లు తెలిపారు.



చోరీకి గురైన ప్రోబ్ పరికరం

మానవ సంబంధాల సౌరభం వనభోజనం

● రాయలసీమ వర్సిటీ వీసీ బసవరావు
● ఘనంగా పద్మశాలీయుల వన భోజన మహోత్సవం



వివిధ రంగాల్లో రాణిస్తున్న ప్రముఖలకు సన్మానం

కర్నూలు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మనుషులు సెల్‌ఫోన్లకు అతుక్కుపోవడం వల్ల మసకబారుతున్న మానవ సంబంధాలను బలోపేతం చేయడం, పచ్చని ప్రకృతిలో మమేకమై ఐక్యతను చాటడం, వన సంరక్షణలో మానవాళిని భాగస్వామ్యం చేయడమే వన భోజన మహోత్సవం ప్రధాన లక్ష్యమని రాయలసీమ వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వెంకట బసవరావు పేర్కొన్నారు. కర్నూలు పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సుంకేసుల రోడ్డులో ఉన్న ఎస్ఎల్ఎన్ గార్డెన్‌లో కార్తీక వన భోజన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు కస్తూరి వేమయ్య, ప్రధాన కార్యదర్శి మేడం సుంకన్న, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిచారు. తులసి, దామోద కల్యాణ మహోత్సవం, ఉసరి చెట్టుకు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రంగాల్లో రాణిస్తూ ప్రజా సేవలో మమేకమైన పద్మశాలి ప్రముఖులు, నీట్, జేఈఈలో ప్రతిభ చూపిన చిన్నారులు, కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. చిన్నారుల సంస్కృతిక కార్యక్రమాలను కనువిందు చేశాయి. ముఖ్య అతిథులుగా హాజరైన రాయలసీమ వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బసవరావు, మాజీ ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, ఏపీ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ కొంకతి లక్ష్మీనారాయణ మాట్లాడారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. పద్మశాలి సంఘం కోశాధికారి గుర్రం శివప్రసాద్, గౌరవ అధ్యక్షుడు క్యాబర్సి గోవిందు, కార్యదర్శి జేరుబండి హరిప్రసాద్, ఉపాధ్యక్షులు సిరసాల లక్ష్మీనారాయణ, కస్తూరి ప్రసాద్ తదితరులు హాజరయ్యారు.



పద్మశాలి వన భోజన మహోత్సవంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

కుమ్మర శాలివాహన సంఘం ఆధ్వర్యంలో..



కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం కార్తీక వనభోజన వేడుకల్లో తుగ్గలి నాగేంద్ర, జి. పుల్లయ్య, పీబీవీ సుబ్బయ్య తదితరులు

కర్నూలు కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నగరంలోని ఏఎంఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన కార్తీక వనభోజన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకలో శాలివాహన ఫెడేషన్ మాజీ అధ్యక్షుడు, శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుగ్గలి నాగేంద్ర, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య, పారిశ్రామికవేత్త రమణ, రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్లు సుధాకర్, పీబీవీ సుబ్బయ్య, సంఘం నగర అధ్యక్షుడు సోమేష్, నంద్యాల జిల్లా అధ్యక్షుడు మద్దయ్య, సీనియర్ నాయకులు నాగన్న, మధు, ఓబులేసు, పాండురంగస్వామి, సురేష్, లక్ష్మన్న, నరసింహుడు, జయరాముడబు, మద్దయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉసిరిక చెట్టు వద్ద పూజలు చేశారు. మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఉమ్మడి జిల్లాలోని కుమ్మర కులస్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

కార్యకర్తలను ఆదుకుంటాం

- ఎమ్మెల్యే జయసూర్య
- బాధిత కుటుంబానికి రూ. 5 లక్షల చెక్కు అందజేత


చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అన్నివిధాలుగా అండగా ఉంటుందని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. ప్రమాదంలో మరణించిన టీడీపీ కార్యకర్త మేకల హరిక్రిష్ణ కుటుంబానికి పార్టీ నుంచి మంజూరు అయిన రూ . ఐదులక్షల చెక్కును ఆదివారం మండలంలోని అల్లూరు గ్రామంలో ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వముంటే కుటుంబానికి ఒక భరోసా అన్నారు. కార్యకర్తల సంక్షేమంపై నారా లోకేశ్ ప్రత్యేక దృష్టి ఉంచారన్నారు. ప్రతిఒక్కరూ క్రియాశీలక సభ్యత్వం పొందాలన్నారు.

బాధితులకు అండగా ఉంటాం

బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మండలంలోని కొణిదేల గ్రామంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన నలుగురు ప్రమాదానికి గురయ్యారు. గొర్రెలు మేపుకొని జీవనం సాగిస్తున్న గొల్ల చెన్నయ్య మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాద విషయాలను అడిగి తెలుసుకున్నారు. అన్నివిధాలుగా అండగా ఉంటామని భరోసా యిచ్చారు. ఆయన వెంట స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆటో

ఆత్మకూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీశైలం రస్తాలో అక్రమంగా తరలిస్తున్న ఆరు క్వింటాళ్ల రేషన్ బి య్యాన్ని పట్టుకున్నట్లు అర్బన్ సీఐ రాము ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మా ట్లాడుతూ మండలంలోని సిద్దాపురం గ్రామం నుంచి ఆటోలో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేసి స్వాధీనం చేస్తున్నట్లు తెలిపారు. అ లాగే ఆటో డ్రైవర్ మల్లికార్జున, యజమాని నగేష్‌తో పాటు రేషన్ బియ్యం కొనుగోలు చేయనున్న నాగరాజుపై కేసు నమోదు చేశామన్నారు. ఆటోను సీజ్ చేసినట్లు వెల్లడించారు.

● పట్టణంలోని ఏబీఎం పాలెం, ఎస్వీజీపాలెంతో పాటు మండలంలోని బాపనంతాపురం గ్రామంలో కార్డన్ సర్చ్ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. బాపనంతాపురానికి చెందిన శ్రీకాంత్ వద్ద 15మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ఖబరస్థాన్‌కు నాలుగెకరాల భూమి


ముల్లా కుటుంబీకులను సన్మానిస్తున్న మతపెద్దలు

ఆత్మకూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణ ఖబరస్థాన్‌కు వక్ఫ్ బోర్డు ఆధీనంలో ఉన్నా నాలుగెకరాల భూమిని ఇవ్వడం అభినందనీయమని ఏపీ ముస్లిం పర్సనల్ లా బో ర్డు కన్వీనర్ మౌలానా జాకీర్ సాబ్ రషాది అన్నారు. ఆదివారం కొత్తపేట మసీదులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 50ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న స్థలాన్ని ముల్లా కుటుంబానికి చెందిన ఖమ్రున్, సలాం, మగ్బూల్‌లు ఆత్మకూరు ఖబరస్థాన్‌కు ఇచ్చారన్నారు. ప్రతి ఒక్కరు సేవా భావాన్ని కలిగి ఉండాలని, ఇదే మహ్మద్ ప్రవక్త నేర్పిన సన్మార్గమని గుర్తుచేశారు. కార్యక్రమానికి పట్టణంలోని మసీదుల మజ్లీసుల్ ఉలమ సభ్యులు, ఆలీమ్‌లు, ముతవల్లీలు, మతపెద్దలు పాల్గొన్నారు.

చంద్ర పుల్లారెడ్డి చిత్రపటానికి నివాళి


చంద్రపుల్లారెడ్డి చిత్రం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

పాములపాడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేంపెంట గ్రామంలో చంద్ర పుల్లారెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఆదివారం వేంపెంట గ్రామంలోని స్థూపం వద్ద చంద్ర పుల్లారెడ్డి చిత్రపటానికి సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసి పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడి అధ్యక్షతన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చిట్టిపాటి వెంకటేశ్వర్లు నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరుణ్ కుమార్, సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ పార్టీ కర్నూలు జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ఐఎఫ్‌టీయూ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మజీద్‌మియా, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి గోపాల్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్, నంద్యాల జిల్లా కార్యదర్శి రాంబాబు, జిల్లా నాయకులు, వివిధ రకాల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం

- టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్
- వైభవంగా కార్తీక వనభోజనాలు


ఆర్యవైశ్యులతో కలిసి సంఘీభావం తెలుపుతున్న ఎన్ఎండీ ఫిరోజ్


టెక్కమార్కెట్‌యార్డులో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

నంద్యాల కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులకు ఏ సమస్య వచ్చినా తాము అండగా ఉంటామని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. ఆదివారం పట్టణంలో ప్రథమనందీశ్వరాలయంలోని కల్యాణమండపంలో బాలాజీ కాంపెక్స్ ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బింగుమళ్ల శ్యామ్‌సుందర్, కౌన్సిలర్ ఖండే శ్యామ్‌సుందర్‌లాల్ ఆధ్వర్యంలో, టెక్కమార్కెట్ యార్డులో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, జనసేన నాయకులు భవనాశి శ్రీనివాస, భవనాశి నాగమహేష్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యుల వనభోజనాల కార్యక్రమాలు నిర్వహించారు. ప్రథమనందిలో వనభోజన కార్యక్రమాలకు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, రాష్ట్ర ఆర్యవైశ్య సత్రాల సముదాయాల కార్యదర్శి ఇల్లూర లక్ష్మయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, టెక్కమార్కెట్ యార్డు కార్యక్రమంలో సాయిరాం, శ్రీశైలం ట్రస్టుబోర్డు మెంబర్ మేడా మురళీధర్, తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ఎన్నికల్లో తమ కుటుంబాన్ని ఎంతగానే ఆశీర్వదించారన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కొశెట్టి చంద్ర, జగదాంబ రత్నకుమార్, సుబ్బలక్ష్మయ్య, కంభం శ్రీనివాసులు, సముద్రాల నాగరాజు, డాక్టర్ మధుసూదనరావు, గంగిశెట్టి శ్రీధర్, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

రజకసేవాసంఘం ఆధ్వర్యంలో..

నంద్యాల కుందూనది ఒడ్డున వెలసిన గంగమ్మతల్లి దేవస్థానంలో రజకసేవాసమితి ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. గంగమ్మతల్లికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం రజకసంఘం నాయకులు బొమ్మల సత్రం సురేష్, నాగభూషణం, లింగ మూర్తి, నాగరాజు, రామకృష్ణా కాలేజీ శ్రీను, కుసుమాంబ ఆధ్వర్యంలో వనభోజనాలు నిర్వహించారు.

శాలి వాహన సంఘం ..

మహానంది: కార్తీక మాసం పురస్కరించుకొని మహానంది శాలివాహన సంఘం ఆధ్వర్యంలో వేలాదిమంది భక్తుల కోసం కార్తీక వన భోజనాలు ఏర్పాటు చేశారు. ఆదివారం మహానంది సమీపంలోని శాలి వాహన సత్రం ఆవరణలో ముందుగా అశ్వత్ నారాయణ కల్యాణం నిర్వహించారు. దాతల సహకారంతో నిర్మించిన గదులను ప్రారంభించారు. అనంతరం వేలాదిమంది భక్తులకు కార్తీక వన భోజనాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏపీ శాలి వాహన సంక్షేమ సంఘం అధ్యక్షుడు తుగ్గలి నాగేంద్ర, శాలి వాహన కార్పొరేషన్ డైరెక్టర్ కుమ్మరి సధాకర్‌తో పాటు మహానంది శాలి వాహన సత్రం సభ్యుడు కుమ్మరి శివయ్యలు పాల్గొన్నారు.


ప్రథమనందిలో వనభోజన కార్యక్రమంలో పాల్గొన్న ఆర్యవైశ్యులు


మహానంది సమీపంలో కార్తీక వన భోజనాలు చేస్తున్న భక్తులు

కవిత్వంతోనే సమాజంలో చైతన్యం

- సూ.సా.స అధ్యక్షుడు డాక్టర్ సహదేవుడు
- ఘనంగా జాతీయ కవి సమ్మేళనం


రచయితలు, కవులను సన్మానిస్తున్న నిర్వాహకులు

నంద్యాల కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కవిత్వంతోనే సమాజంలో చైతన్యాన్ని తీసుకురావచ్చని సూరన సారసత్వ సంఘం (సూ.సా.స) అధ్యక్షుడు డాక్టర్ సహదేవుడు అన్నారు. తెలుగ కళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ, ఉషోదయ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నంద్యాలలో శ్రీశైల స్కూల్‌లోని సెమినార్ హాలులో జాతీయ కవి సమ్మేళనాన్ని ఉషోదయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షురాలు ధనాశి ఉషారాణి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ యు.వి.రత్నం ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సూ.సా.సం అధ్యక్షుడు డా.సహదేవుడు, రచయితలు, డా.కిషోర్‌కుమార్, అన్నెం శ్రీనివాసరెడ్డి, మురళీక్రిష్ణారావు, ప్రిన్సిపాల్ మరియదాసు, నీలకంఠమాచారి తదతరులు హాజరయ్యారు. "పసిడి నవ్వులు వెన్నెల దివ్వెలు" అనే అంశంపై వివిధ జిల్లాల నుంచే కాక పొరుగు రాష్ట్రాలనుంచి కవులు పాల్గొని తమ కవితలను చదివి వినిపించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ కవులను సాహిత్యాన్ని కవిత్వాన్ని రక్షించుకోవాల్సి బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. విద్యార్థులచే పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కవులు సాహిత్యసేవకు గుర్తింపుగా కవులను సత్కరించారు. సమ్మేళనంలో వందమందికిపైగా సాహిత్యనిపుణులు, కవులు, రచయితలు, డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు, కొప్పుల ప్రసాద్, నరేంద్ర, మాబుబాషా, కేశవమూర్తి, రఫీ, శేషఫణి పాల్గొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు


కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

నంద్యాల కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఆదివారం, ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకొని పట్టణంలోని అన్ని శివాలయాలల్లో ఉదయాన్నే భక్తులు కార్తీక పూజలు చేశారు. ప్రథమనందీశ్వరాలయంలో భక్తులు శివయ్యను దర్శించుకున్నారు. ఆలయ పరిసరాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో కార్తీకదీపాలు, ఉసిరి చెట్టు కిం ద కార్తీకదీపాలు వెలిగించారు. భక్తుల శివనామస్మరణతో ఆలయంప్రాంగణం మార్మోగింది. దాతల సహకారంతో ఉచిత అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య వసతి సముదాయాల కార్యదర్శి ఇల్లూరి లక్ష్మయ్య, చలంబాబు, శ్యామ్ సుందర్‌లాల్, శ్యామ్‌సుందర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కాశీ విశ్వేశ్వరుడికి అన్నాభిషేకం


కాశీవిశ్వేశ్వరుడికి అన్నాభిషేకం

నంద్యాల సంజీవనగర్ కోదండరామాలయంలో వెలసిన కాశీ విశ్వేశ్వరుడికి ఆదివారం భక్తిశ్రద్ధలతో అన్నాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. కార్తీకమాస ఉత్సవాలలో భాగంగా ఆదివారం స్వామివారికి ఉదయం ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. అనంతరం భగవత్ సేవాసమాజ్ కమిటీ ఆధ్వర్యంలో వండిన అన్నంను స్వామివారికి రాశిగా పోసి అన్నాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

లక్షబిల్వార్చన

కార్తీకమాసం సందర్భంగా ఆదివారం నంద్యాల ఎస్‌బీఐ కాలనీ రామాలయంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యుల భక్తి శ్రద్ధలతో లక్షబిల్వార్చన నిర్వహించారు. కార్యక్రమంలో మారం వెంకటసుబ్బయ్య, కాలనీ భక్తులు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి


దీక్షలో పులికొండన్న, లాలుస్వామి తదితరులు

నంద్యాల నూనెపల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంవీఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులికొండన్న, ప్రధాన కార్యదర్శి లాలుస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని బొగ్గులైన్ వద్దనున్న వాల్మీకి మహర్షి విగ్రహానికి పూజలు నిర్వహించి అనంతరం ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకోని మౌనదీక్ష చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ 1956లో ఆనాటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి ఎస్టీలుగా ఉన్న వాల్మీకులను ప్రాంతీయ వ్యత్యాసంతో ఏజెన్సీ, నాన్ ఏజెన్సీ పేరుతో విడగొట్టి 5 జిల్లాల్లో ఏజెన్సీ వాల్మీకులను ఎస్టీలుగా, మిగతా 8 జిల్లాల్లో నాన్‌ఏజెన్సీ వాల్మీకులను బీసీలుగా విభజించి అన్యాయం చేశారన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు వస్తున్న పాలకులంతా వాల్మీకులకు మాయ మాటలు చెప్పి గద్దెనెక్కిన తర్వాత పట్టించుకోవడం లేదన్నారు. 2017, 2023లో అప్పటి పాలకులు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపినా ఫలితం దక్కలేదన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పార్లమెంట్‌లో ఆమోదం పొందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎంవీఆర్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు, లాయర్ బోయ సుబ్బరాయుడు, కార్యదర్శి జయరాం, అధికార ప్రతినిధులు గోపాలు, మురళికృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ స్వామినాయుడు, యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, బ్రహ్మనాయుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్

నంద్యాల టౌన్ , అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో మైనర్ల డ్రైవింగ్‌పై ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ మల్లికార్జున మాట్లాడుతూ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో 26మంది మైనర్లు వాహనాలు నడుపుతుండగా గుర్తించి ఒక్కొక్కరికి రూ. ఐదువేలు చొప్పున జరిమానా విధించామన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఆత్మకూరురూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం నేటికీ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో దళారుల చేతుల్లో రైతులు మోసపోతున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి వీరన్న, పట్టణ నాయకుడు కిరణ్ ఆరోపించారు. ఆదివారం వారు మాట్లాడుతూ సోమవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. వర్షానికి దెబ్బతిన్న పంటలకు బీమా వర్తింపజేసి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

నలుగురికి గాయాలు

నంద్యాల టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : ఆటో, కారు ఢీకొని నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన నంద్యాలలో ఆదివారం చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. నూనెపల్లె ఫ్లైఓవర్ బ్రిడ్జి మీద కారు, ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఆటోలోని ప్రయాణికులకు గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసును నమోదు చేసుకున్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఇసాక్‌బాషా

నంద్యాల రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలలను ప్రవేటీకరణ చేయడం దర్మార్గమని ఎమ్మెల్సీ ఇషాక్‌బాషా అన్నారు. ఆదివారం మాజీ ఎమ్మెల్సీ శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి నివాసంలో మెడికల్ కళాశాలల పీపీపీ విధానాన్ని నిరసిస్తూ ఈనెల 12న వైసీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రజా ఉద్యమ ర్యాలీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రవేటీకరణను వైసీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఉదయానంద రెసిడెన్సి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టి ఉన్నతాధికారులకు వినతి పత్రం సమర్పిస్తామన్నారు. మెడికల్ కళాశాలల ప్రవే టీకరణను కూటమి ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా విభాగం జాయింట్ కార్యదర్శి శశికళారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దాల్‌మిల్ అమీర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బుడ్డా


తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బుడ్డా

ఆత్మకూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామిని ఆదివారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో స్వామివారి దర్శనం చేయించారు. అలాగే అర్చకులు వేదాశీర్వచనాలతో పాటు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట పారిశ్రామివేత్త ఆవుల నారాయణరెడ్డి కుటుంబసభ్యులు ఉన్నారు.

ఉద్యమాల్లో భాగస్వాములు కావాలి


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్

ఆత్మకూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉద్యమాల్లో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో సోషలిస్ట్ విప్లవ శత వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దోపిడీ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా సోషలిజం నిలిచిందన్నారు. ఇదే స్ఫూర్తిగా అనేక దేశాలు స్వాతంత్ర్యాన్ని పొందాయని గుర్తుచేశారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు సుధాకర్, వెంకటేశ్వరరావు, స్వాములు, రజాక్, రామ్‌నాయక్, నాగేశ్వరరావు, వీరన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

12 నుంచి క్రీడాకారులకు శిక్షణ

ఆత్మకూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని కేవీకే స్టేడియంలో ఈ నెల 12 నుంచి 27వరకు క్రీడాకారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు స్టేడియం ఇన్‌చార్జి జునైద్‌బాషా ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాలీబాల్ క్రీడలకు సంబంధించి రైల్వేస్ మాజీ క్రీడాకారుడు నిమ్మి కృష్ణ, ఖోఖోకు సంబంధించి మహెబూబ్ శిక్షణ ఇస్తారని తెలిపారు. 15రోజుల పాటు జరిగే ఈ శిక్షణా శిబిరానికి హాజరయ్యే క్రీరడాకారులకు ఒంగోలు గౌమతి ఫౌండేషన్ అధినేత పెద అంకయ్య చౌదరి భోజన సదుపాయాన్ని కల్పించనున్నట్లు వెల్లడించారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

బండిఆత్మకూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని వైద్యులు భావన, దినేష్‌బాబు అన్నారు. ఆదివారం బండిఆత్మకూరు యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ రక్తం ఇవ్వటం వల్ల ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. ముఖ్యంగా యువత రక్తం ఇవ్వటానికి ముందుకు రావాలని కోరారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ అందజేశారు. కార్యక్రమంలో సంతజూటూరు సొసైటీ సీఈవో గోపాల్, ఏఎస్ఐ బాషా, ఎఫ్ఎన్‌వో కాశీంనాయక్, ఎమ్మార్పీఎస్ నాయకుడు వెంకటసుబ్బన్న, సుబ్బారెడ్డి, గోకారి, రోషన్‌బాషా పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నంద్యాల కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చందూ ఆర్ట్స్ చిత్రకారుడు చందూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం నంద్యాల చిత్రకారుల సంఘం తరుపున రూ. 50వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నంద్యాల చిత్రకారుల సంఘం అధ్యక్షుడు పోసా శ్రీనివాసులు, విజయ్‌ఆర్ట్స్, రాజా ఆర్ట్స్, చిత్రకారులు శివరాముడు, ధనరాజ్, బాబీ, నరసింహ, ఓబులేసు, రాజారామ్, తరుణ్, జయరామ్, ప్రభాకర్ తదితరులున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఆర్టిస్టులకు అసోసియేషన్ అండగా ఉంటుందని అన్నారు. ప్రభుత్వం చిత్రకారులను ఆదుకోవాలని కోరారు.

వెరికోస్ వీన్స్ వైద్య శిబిరం

నందికొట్కూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవీ భవనంలో అవోపా , ఏసీఎస్‌వాస్కులర్స్ హాస్పిటల్స్ సంయుక్తంగా ఉచిత వెరికోస్ వీన్స్ వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. డాక్టర్ అనిల్, వేస్కురల్ రెసిడెంట్, ఏసిఏస్ వేస్కులర్ హాస్పిటల్, జోనల్ ఇన్‌చార్జి సురేందర్ సుమారుగా 200మంది పేషంట్లను పరీక్షించారు. వ్యాధి నిర్ధారణ అయిన రోగులను హైదరాబాద్ తీసుకెళ్లి లేజర్ చికిత్స చేస్తామన్నారు. కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన అవోపా పట్టణ అధ్యక్షుడు బీమిశెట్టి జయరామకృష్ణ, కార్యదర్శి, సభ్యులకు హాస్పిటల్ వాళ్లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అవోపా గౌరవ అధ్యక్షుడు వీరబొమ్మ నాగ సత్యనారాయణ, కల్కి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి అల్వాల గురుమూర్తి, కోశాధికారి సర్విశెట్టి పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా న్యాయ సేవల దినోత్సవం

నందికొట్కూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పగిడ్యాల మండల కేంద్రంలోని బీసీ కాలనీలో న్యాయ సేవల ది నోత్సవాన్ని ప్యానెల్ న్యాయవాది ఎస్.మద్దయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. న్యాయవాది మద్దయ్య మాట్లాడుతూ న్యాయ సేవల విలువలను, వాటి ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ఉచితంగా న్యాయ సేవలు ప్రతి ఒక్కరూ పొందవచ్చన్నారు. ఏదైనా సందేహాలు ఉన్నట్లైతే కోర్టు ఆవరణలోని మండల న్యాయసేవా సంఘాన్ని సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సంజీవయ్య, పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

కాశిరెడ్డి నాయన అన్నదాన సత్రానికి విరాళాలు

కొత్తపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సంగమేశ్వరం కాశిరెడ్డి నాయన నిత్యాన్నదానసత్రానికి రేకులషెడ్డు నిర్మాణానికి, అన్నదానానికి దాతలు ముందుకు వచ్చినట్లు సత్ర నిర్వాహకులు శేషన్న, రోశన్న, ఎల్లయ్య తెలిపారు. ఆదివారం శేషన్న మాట్లాడుతూ సంగమేశ్వరంలోని కృష్ణానది ఒడ్డున అటవీ ప్రాంతంలో దాతల సహకారంతో సత్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇటీవల భక్తుల రద్దీ పెరగడంతో సత్రాన్ని భక్తులకు అనుగుణంగా విస్తరించనున్నట్లు తెలిపారు. విస్తరణలో భాగంగా రేకుల షెడ్డు నిర్మాణం కోసం సంగమేశ్వరం నివాసి కేశన్న, కటాంజనం ఏర్పాటుకు పెనరవాయి గ్రామానికి చెందిన దాత మల్లు చంద్రారెడ్డి ముందుకు వచ్చారన్నారు. పలువురు దాతలు విరాళంగా ఇచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

'రాయల్టీని ప్రైవేట్‌కు అప్పగించరాదు'

నంద్యాల రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాపరాయి గనులకు సంబంధించిన రాయల్టీ వసూలును ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించరాదని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నాపరాయి గనుల పన్నుల వసూల్‌కు సంబంధించి ప్రైవేట్ వ్యక్తులతో టెండర్లు నిర్వహించి వసూలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, సహాయ కార్యదర్శి లక్ష్మీదేవి, మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి సుశీలమ్మ పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

అహోబిలేశుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే



ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియకు తీర్థ ప్రసాదాలు అందజేస్తున్న ప్రధాన అర్చకులు

ఆళ్లగడ్డ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువ, దిగువ అహోబిలం క్షేత్రాలను ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం ప్రధాన అర్చకుడు కీడాంబి వేణుగోపాల్ స్వామి, వేదపండితులు ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ప్రహ్లాదవరదస్వామి వారికి అష్టోత్తర శతనామార్చన, అమృతవల్లి అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వ హించారు. అనంతరం రంగనాయక మంటపంలో అర్చకులు ఆమెకు వేద ఆశీర్వచనం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు.

రామతీర్థంలో ఎమ్మెల్యే పూజలు: రామతీర్థం క్షేత్రాన్ని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ దర్శించుకున్నారు. సుబ్రమణ్వేర స్వామివారి పుట్టకు ఆమె పూజలు చేశారు. దేవస్థానం ఈవో సాయి జయచంద్రరెడ్డి, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

వైభవంగా గౌరమ్మ నిమజ్జనం



గౌరమ్మ విగ్రహంతో ఊరేగింపు చేస్తున్న మహిళలు

చాగలమర్రి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని బుగ్గమల్లేశ్వర ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా ఆదివారం మహిళలు సామూహికంగా గౌరమ్మ నిమజ్జనాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకముందు కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రతిష్ఠించిన గౌరమ్మ విగ్రహాన్ని వీధుల గుండా గ్రామోత్సవం చేశారు. బుగ్గమల్లేశ్వర ఆలయంలోగల కొనేరులో గౌరమ్మకు పూజలు చేసి నీటిలో వదిలేశారు. శివపార్వతుల వద్ద మహిళలు దీపాలు వెలిగించారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

రూ.3కోట్లతో ఇటిక్యాల-ఉమ్మాయిపల్లె రహదారి పనులు



కొనసాగుతున్న బీటీ రోడ్డు పనులు

కొలిమిగుండ్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గ్రామీణ రోడ్లకు మహర్దశ వచ్చింది. రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి చొరవతో మండలంలోని పలు గ్రామాల్లో రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఇటీవల కొలిమిగుండ్ల, పెట్నికోట బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి కాగా మండలంలోని ఇటిక్యాల, ఉమ్మాయిపల్లె ప్రధాన రహదారి పనులు వేగంగా సాగుతున్నాయి. ఇటిక్యాల నుంచి చింతలాయపల్లె మీదుగా ఉమ్మాయిపల్లె వరకు ప్రధాన రహదారి దెబ్బతినడంతో ప్రజలు ఇబ్బందులను ఎదుర్కోనేవారు దీంతో మంత్రి బీసీ చొరవ తీసుకుని నాబార్డు నిధుల కింద రూ.3కోట్లు మంజూరు చేయించారు. దీంతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు వేగంగా కొనసాగితున్నాయని ఆర్అండ్‌బీ ఏఈ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు: ఎస్ఐ

శిరివెళ్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజలను తప్పుదోవ పట్టించేలా సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శిరివెళ్ల ఎస్ఐ చిన్న పీరయ్య ఆదివారం హెచ్చరించారు. నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలోని అటవీ ప్రాంతంలో ప్రవహిస్తున్న వాగులో వజ్రాలు దొరుకుతున్నాయని సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలపై ఎస్ఐ స్పందించారు. సోషల్ మీడియా వార్తల ఆధారంగా నంద్యాల, ప్రకాశం, కర్నూలు జిల్లాల నుంచి ప్రజలు తండోపతండాలుగా వజ్రాల అన్వేషణ కోసం వస్తున్నారన్నారు. దీంతో ఎస్ఐ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని ప్రజలకు అవగాహన కల్పించారు.

గడువు పొడిగింపు

చాగలమర్రి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాల దరఖాస్తుకు ఈనెల చివరి వరకు గడువు పొడిగించినట్లు హౌసింగ్ ఏఈ నవీన్ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఆవాజ్‌యోజన కింద గృహాలు మంజూరయ్యాయ న్నారు. వీటికి ప్రభుత్వం ఒక్కో గృహ నిర్మాణానికి రూ.1.59 లక్షలు మంజూరు చేస్తుందన్నారు. అవసరమైన వారు ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు అకౌంట్, ఉపాధి హామీ జాబ్‌కార్డు, స్థలానికి సంబంధించి పొజిషన్ సర్టిఫికెట్లను ఈనెల 30వ తేదీలోపు సచివాలయాల్లో గానీ హౌసింగ్ కార్యాలయంలో అందజేయాలని అన్నారు.

సిద్ధ రామేశ్వరుడికి అన్నాభిషేకం

కొలిమిగుండ్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెలుం గ్రామంలో వెలసిన సిద్ధ రామేశ్వరస్వామికి అన్నాభిషేకం వైభవంగా నిర్వహించారు. కార్తీకమాసం ఆరుద్ర నక్షత్రం ఆదివారం పురస్కరించుకొని భక్తులు స్వామి వారికి అన్నాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహేష్ శర్మ స్వామివారిని అన్నంతో అలంకరించారు.

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలోని రామలింగేశ్వర ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా ఆదివారం అన్నాభిషేకాన్ని మహిళలు వైభవంగా నిర్వహిం చారు. ఈశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో అన్నంతో అలంకరించారు. భక్తులు శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లింగమయ్య స్వామికి పూజలు

రుద్రవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తలూరు గ్రామ పరిధిలో కొలువుదీరిన లింగమయ్య స్వామికి ఆదివారం అర్చకులు పూజలు చేశారు. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి వందలాదిమంది భక్తులు తరలివచ్చి లింగమయ్య స్వామిని దర్శించు కొని పూజలు చేశారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

చాగలమర్రి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో డీలర్లు రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 60 ఏళ్ల దాటిన వృద్ధులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేయాలన్నారు.

ఘనంగా కార్తీక వనభోజనాలు

డోన్ టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రెడ్డి కార్తీక వనభోజనం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి డోన్ టీడీపీ యువ నాయకులు ధర్మవరం గౌతమ్ కుమార్ రెడ్డి, రెడ్డి సంఘం కులస్తులు హాజరయ్యారు. సంఘం పెద్దల ఆధ్వర్యంలో ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మధ్యాహ్నం వనభోజనం నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్డి కుల సంఘాల నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బలిజ సంఘం ఆధ్వర్యంలో..

ఆళ్లగడ్డ: పట్టణంలోని కాశింతల క్షేత్రంలో బలిజ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనభోజనం ఘనంగా నిర్వహించారు. ఆళ్లగడ్డ బలిజ సంఘం అధ్యక్షుడు నల్లగట్ల బాలుడు ఆధ్వర్యంలో భక్తులకు వనభోజనాలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గ బలిజ సంఘం నాయకుల సమావేశం నిర్వహించారు. బలిజ సంఘం అధ్యక్షుడు బాలుడు, గౌరవ అధ్యక్షుడు ప్రసాద్, సభ్యులు వీరభద్రుడు, జన సేన సమన్వయ కర్త మైలేరి మల్లయ్య, గుత్తి నరసిం హులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం..

బనగానపల్లె: పట్టణంలోని ఎస్సార్బీసీ కాలనీలోని షిర్డీసాయిబాబా ఆలయంలో ఆదివారం బనగానపల్లె ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనం నిర్వహించారు. ఈసం దర్బంగా ఆర్యవైశ్య మహిళలు గౌరమ్మకు పూజలు చేశారు. అనంతరం ఆలయంలో కార్తీక వనభోజనాలు నిర్వహించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గాధం శెట్టి వేణుగోపాల్, కార్యదర్శి శ్రీరామ వెంకటసుబ్రహ్మణ్యం, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం..

కోవెలకుంట్ల: పట్టణంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనం ఆదివారం నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఓటింగ్ ద్వారా నూతన కార్యవర్గం సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోవెలకుంట్లకు చెందిన టి.రాజేశ్వరాచారిని ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా ముత్తోజీ వీరబ్రహ్మంగారు పాల్గొనగా ఎన్నికల పరిశీలకునిగా ఉమ్మడి కర్నూలు జిల్లా విశ్వబ్రాహ్మణసంఘం ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి ఆచారి, ప్రధాన కార్యదర్శి శివరంగయ్యలు పాల్గొన్నారు. కార్యక్రమంలో శివవయ్య, రామస్వామయ్య, దామోదరాచారి, దేవేంద్రకుమారాచారి, కర్ణఆచారి, శ్రీనివాసాచారి, మునిస్వామి ఆచారి, రాఘవాచారి, రమేష్ ఆచారి, విశ్వబ్రాహ్మణసంఘం మహిళలు పాల్గొన్నారు.

వాల్మీకి వన భోజనాలకు..

డోన్ రూరల్: పట్టణంలో నిర్వహించే వాల్మీకి వనభోజన కార్యక్రమానికి డోన్‌కు చెందిన ప్రముఖ వైద్యులు మాధవకృష్ణ రూ.20వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. ఈ మేరకు డోన్ వాల్మీకి సంఘం నాయకులు ఉంగరానిగుండ్ల చిన్నమద్ది, బోయ ఈశ్వర్ నాయుడు, ఆర్మీ రామయ్యలకు రూ.20వేలు అందజేశారు.



డోన్: రెడ్డి కార్తీక వనభోజనంలో పాల్గొన్న ధర్మవరం గౌతమ్ రెడ్డి తదితరులు



డోన్: సాంస్కృతిక ప్రదర్శనలో బాలికలు







ఆళ్లగడ్డ: కాశింతల క్షేత్రంలో వనభోజనాలు చేస్తున్న బలిజ సంఘం నాయకులు, బనగానపల్లె: గౌరమ్మకు పూజలు చేస్తున్న ఆర్యవైశ్య మహిళలు, కోవెలకుంట్ల: కార్తీక వనభోజన కార్యక్రమంలో పాల్గొన్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

గోవులను రోడ్లపై వదలొద్దు



మాట్లాడుతున్న టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గోవులను రోడ్లపై వదలొద్దని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ గోవుల యజమాను లకు సూచించారు. ఆదివారం ఆమె మంత్రి క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. గోవుల యజమానులు ఇష్టమొచ్చినట్లు పట్టణాల్లో వదలు తుండడంతో అవి రోడ్లు మీద పడుకుంటున్నట్లు తెలిపారు. గతంలో బనగానపల్లెలో ఇలా రోడ్లపై పడుకోవడంతో వాహనాలు ఢీకొన్నడంతో గాయాలకు గురి అవుతు ండడంతో గోశాలకు తరలించామన్నారు. అయితే కోవెలకుంట్లలో కూడా గోవులను రోడ్లపై వదలుతున్నారన్నారు. ఆదివారం ఓ గోవును గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గోవు కాలికి తీవ్రగాయాలై రోడ్డుపై రక్తస్రావం అయిందన్నారు. ఇది తనను ఎంతో కలచివేసిందన్నారు. ఇలాంటి ఘటనలు జరుగకుండా గోయ జమానులు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ప్రజా ఉద్యమం ఉధృతం

డోన్ రూరల్ నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ప్రయత్నాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం ఉధృతం చేస్తున్నామని డోన్, బేతంచెర్ల ఎంపీపీలు రేగటి రాజశేఖర్ రెడ్డి, బుగ్గన నాగభూషణంరెడ్డి, డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఈ నెల 12వ తేదీన చేపట్టే నిరసన ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఈ నెల 12న డోన్‌లో చేపట్టే భారీ నిరసన ర్యాలీలో కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నాలని కోరారు. కార్యక్రమంలో డోన్ మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుశేన్, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు మల్లికార్జునరెడ్డి, సోమేష్ యాదవ్, డోన్, బేతంచెర్ల, ప్యాపిలి నాయకులు దినేష్ గౌడు, ఆర్ఈ రాజావర్దన్, వెంకటేశ్వరరెడ్డి, తిరుమలేశ్వరరెడ్డి, నాగభూషణం రెడ్డి పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వద్దు

డోన్ రూరల్ నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వద్దని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం శెట్టి, జిల్లా అధ్యక్షుడు రామమూర్తి అన్నారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణ ప్రయత్నాలకు వ్యతిరేకంగా కరపత్రాలను విడుదల చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి, నాయకులు సుబ్బరాయుడు, ఎన్ఎస్ బాబు పాల్గొన్నారు.

డోన్ టౌన్: కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణను విరమించుకోవాలని ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ సోమేష్ యాదవ్ అన్నారు. ఆదివారం మం డలంలోని కనపకుంట గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రచ్చబండ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వైసీపీ నాయకులు దొరవల్లి చిరంజీవి, మల్కాపురం మద్దయ్య, జయచంద్రరెడ్డి, శివరామిరెడ్డి, రామచంద్రా రెడ్డి, శ్రీరాములు, లక్ష్మయ్య, బాల మద్దయ్య పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ న్యాయ సేవల దినోత్సవం

డోన్ టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఏఈ నాగరాజు గౌడు, న్యాయవాదుల ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథులుగా పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, సీనియర్ న్యాయవాది గార్లపాటి మద్దిలేటి, జాతీయ ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి గూండాల ఈశ్వరయ్య, సీపీఐ మహిళా నాయకురాలు అమృతారెడ్డి, ఐద్వా నాయకురాలు చాముండేశ్వరి హాజరయ్యారు. అనంతరం రేణుకా ఎల్లమ్మ జీవిత చరిత్రపై నిర్వహించిన వకృత్వ పోటీల్లో గెలుపొందిన విజేతలు జోష్ణవి, బి.మౌనికలకు సీఐ ఇంతియాజ్ బాషా, ఎస్ఐ నాగరాజులు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే ప్రజా సంఘాల నాయకులంతా సీఐ ఇంతియాజ్ బాషాను సన్మానించి రేణుకా ఎల్లమ్మ చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది శ్యాంసుందరం, వైసీపీ ఆవులదొడ్డి సర్పంచ్ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి రూ.50 వేలు విరాళం



ఆలయ సిబ్బందికి విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నందవరం చౌడేశ్వరీ మాత ఆలయాభివృద్ధికి హైదరాబాద్‌కు చెందిన భరత్‌కుమార్, సంగీత దంపతులు రూ.50వేలు విరాళం ఆదివారం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి చేతుల మీదుగా అందించారు. దాతలు మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి ఈ విరాళం వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

ఎస్టీ రిజర్వేషన్ కోసం పోరాటం

బేతంచెర్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎస్టీ రిజర్వేషన్ కోసం 67 ఏళ్లుగా పోరాటం చేస్తున్నామని వీఆర్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు మురళీకృష్ణ, మండల నాయకులు బ్రహ్మనాయుడు, స్వామి నాయుడు అన్నారు. ఆదివారం నంద్యాలలో జరిగే వాల్మీకి మౌన దీక్ష కార్యక్రమానికి బేతంచెర్ల మండలం నుంచి వాల్మీకులు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో నాగరాజు, నిరంజన్, మల్లికార్జున, కేశాలు, కిరణ్, రంగస్వామి, మద్దిలేటి, పాల్గొన్నారు.

ఎస్టీ పునరుద్ధరణే వాల్మీకుల ధ్యేయం

కొలిమిగుండ్ల: ఎస్టీ పునరుద్ధరణే వాల్మీకుల ధ్యేయమని ఆ సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్ గోపాల్ పేర్కొన్నారు. ఆదివారం కొలిమిగుండ్లలో ఎంవీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నంద్యాల జిల్లా కేంద్రంలో జరిగే వాల్మీకి మౌన దీక్ష కార్యక్రమానికి తరలి వెళ్లారు. కార్యక్రమంలో నాయకులు నరసింహులు, రమణ, సుధాకర్, రామ్మూర్తి, మద్దిలేటి పాల్గొన్నారు.



బేతంచెర్ల: సంఘీభావం తెలుపుతున్న వాల్మీకులు



కొలిమిగుండ్ల: ర్యాలీలో పాల్గొన్న వాల్మీకి నాయకులు

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

బేతంచెర్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీఆర్ పేటలో నివాసముంటున్న పరుశురాముడు, లక్ష్మీదేవి దంపతుల ఇంట్లో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటల్లో వస్తువులన్నీ దగ్ధమయ్యాయి. బాధితుల వివరాల మేరకు పరుశురాముడు, లక్ష్మీదేవి దంపతులు తమ పని నిమిత్తం బయటకు వెళ్లగా ఇంట్లో ఉన్న కూతుళ్లు సెల్‌ఫోన్‌కు చార్జింగ్ పెట్టుకునేందుకు స్విచ్ ఆన్ చేయగా.. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. దీంతో మంటల్లో ఉన్న టీవీలు, దుస్తులు, వంటసామగ్రితోపాటు రూ.60వేల నగదు మంటల్లో కాలిపోయాయని బాధితులు వాపోయారు.

జూదరుల అరెస్టు

కొలిమిగుండ్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వటాల సమీపంలో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు ఆదివారం తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.20,260 నగదు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నేరాలకు పాల్పడితే భవిష్యత్తు అంధకారం

కొలిమిగుండ్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నేరాలకు పాల్పడితే భవి ష్యత్తు అంధకారమవుతుందని కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పాత నేరస్తులకు సీఐ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. క్షణికావే శంలో తప్పులు చేసిన వారు తమ ప్రవర్తనను మార్చుకొని శాంతియుత జీవనాన్ని కొనసాగించాలని సీఐ సూచించారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా

ప్యాపిలి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలపై పోలీసు నిఘా ఉంచినట్లు ఎస్ఐ మధుసూదన్ తెలిపారు. ఆదివారం ఆయన పోలీసు కార్యాలయంలో మాట్లా డుతూ మండలంలో మట్కా, పేకాట, నాటుసారా విక్రయాల నిర్మూలనే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు ఎక్కడైన పేకాట, మట్కా నిర్వహిస్తుంటే 9121101120 సమాచారం అందించాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని అన్నారు.

ముచ్చట్ల మల్లికార్జున స్వామికి అభిషేకాలు

బేతంచెర్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని ముచ్చట్ల భ్రమరాంబ మల్లికార్జున స్వామికి భక్తులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ముచ్చట్ల మల్లికార్జున స్వామిని దర్శించుకుని కాయకర్పూరాలు సమర్పించారు ఆలయ అర్చకుడు చంద్రశేఖర్ శర్మ స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు పూజలు చేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కొలిమిగుండ్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొర్విమాన్‌పల్లె గ్రామ సమీపంలో లొక్కి గుండం వద్ద వెలిసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయ 8వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. గొర్విమాన్‌పల్లె, తుమ్మలపెంట తదితర గ్రామాల ప్రజలు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు పులిప్రకాష్ రెడ్డి, రైతు సంఘం నాయకులు పుల్లయ్య, విజయ, నరసింహుడు, లక్ష్మీ నరసింహ, కొండప్ప, జయన్న పాల్గొన్నారు.

బైకును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

ఒకరికి గాయాలు

కోవెలకుంట్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలో ఆర్టీసీ బస్సు బైకును ఢీకొన్న ఘటనలో రాకేష్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. సౌదరదిన్నె గ్రామానికి చెందిన రాకేష్ కోవెలకుంట్లకు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన రాకేష్‌ను చికిత్స నిమి త్తం ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డీఏ ఇవ్వడం హర్షణీయం

● పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కేఎన్ భానుసింగ్



విశ్రాంత ఉద్యోగిని సన్మానిస్తున్న సంఘం నాయకులు

డోన్ రూరల్ నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఈ ప్రభుత్వంలోనే పెన్షనర్ల సమస్యలు పరిష్కారం అవుతాయని, ఒక డీఏ ఇవ్వడం హర్షణీయమని పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కేఎన్ భానుసింగ్ అన్నారు. ఆదివారం పెన్షనర్ల సంఘం కార్యాలయంలో పెన్షనర్ల సర్వసభ్య సమా వేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీఆర్‌సీ వచ్చేవరకు 30 శాతం మధ్యంతర భృతిని ఇవ్వాలని కోరారు. అనంతరం ఇటీవల పదవి విరమణ పొందిన పాఠశాల సీనియర్ అసిస్టెంట్ గోవిందరెడ్డిని పెన్షనర్ల సంఘం నాయకులు సన్మానించారు. సమావేశంలో సంఘం నాయకులు సుబ్బరాయుడు, గాలయ్య, గోపాల్, రామదాసురెడ్డి, అంజినేయులు, హుశేన్, మౌలాలి పాల్గొన్నారు.

విశ్రాంత సీఈవో మృతి



నాగరాజారావు (ఫైల్)

సంజామల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సంజామల సహకార బ్యాంకు విశ్రాంత సీఈవో ఇంజెటి నాగరాజారావు (81) అనారోగ్యంతో ఆది వారం మృతి చెందారు. సంజామలకు చెందిన నాగరాజారావు 1965లో సీయూసీ విద్యను పూర్తి చేసి కో-ఆపరేటివ్ శిక్షణ పొందారు. 1967లో సంజామల కో-ఆపరేటివ్ సహకార బ్యాంకు సీఈవోగా బాధ్యతలు చేపట్టారు. సుదీర్ఘంగా 40 సంవత్సరాలపాటు పనిచేసి అన్ని వర్గాల ప్రజలు, రైతుల మన్ననలు పొంది 2007లో పదవీ విరమణ పొందారు. అనంతరం కర్నూలు శిల్పా టౌన్‌షిప్‌లో స్థిరపడ్డ ఆయన తన సతీమణి మృతి చెందడంతో ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నప్పటికీ పల్నాడు జిల్లా మాచర్లలోని వాసవీ సేవా ఆశ్రమంలో ఉంటూ కన్నుమూశారు. నాగరాజు మృతిపై మండల ప్రజలు, నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

పునాదులకే పరిమితం

● ముందుకు సాగని సచివాలయ నిర్మాణ పనులు



కలుగొట్లలో పునాదులకే పరిమితమైన సచివాలయ నిర్మాణం

కోవెలకుంట్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో కలుగొట్ల గ్రామంలోని సచివాలయ భవనం నిర్మాణానికి నోచుకోకపోవడంత పునాదులకే పరిమితమైంది. అప్పటి వైసీపీ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు 3వేల జనాభా ఉన్న గ్రామాలకు సచివాలయం ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టింది. కలుగొట్ల గ్రామంలో సుమారు 5వేల జనాభా ఉంది. అయితే అప్పటి అధికారులు నిర్లక్ష్యమో అలసత్వమో తెలియదు కానీ ఐదేళ్లు పూర్తయిన ఆ గ్రామంలో సచివాలయ నిర్మాణానికి నోచుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతన్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీ భవనంలో సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా కలుగొట్ల గ్రామంలో సచివాలయం నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.